
# విధివిక్షితం

పరిమి వాణి




అనంతం అందరిలాగే మానవుడిగా పుట్టాడు...అందరిలాగే పెరిగాడు కూడా! అయితే అతనిలో కొన్ని దుష్టశక్తులు అతడ్ని పతనం చేశాయి. మానవుడు స్వార్థపరుడైనపుడు 'దానవుడు'గా మారి తాడు! పతనం అయిన 'ఆ దానవుని'లో మానవత్వం తలెత్తుతుంది...కాని...'చేతులు కాలేక ఆకులు పట్టుకుని' లాభం ఎంత ఉన్నదో? పతనమైన మానవ దుఃఖానికీ, పశ్చాత్తాపానికి అదేలాభం! మానవుడు మానవుడ గానే బ్రతికితే ఈ ఇబ్బందే లేదేమో! మరి!

అనంతం ఇరవైఏళ్లదాకా బ్రహ్మచారిగానే బ్రతికాడు...ఆ తర్వాత ఓ శుభక్షణాన అన్నపూర్ణ సాహచర్యం లభించింది...చూచేవారికి చిలకాగోరింకల్లా కనబడుతూ, అన్యోన్యంగా ఉండేవారు. మానవుడికి సుఖం మీద సుఖం వస్తుందనే మాటను యదార్థం చేస్తూ అనంతానికి స్కూల్సు ఇన్స్పెక్టరుగా ప్రమోషను వచ్చింది...

అప్పుడప్పుడు దూరంగానూ, తరుచు దగ్గర పల్లెలకి వెళ్లి వస్తూఉండే వాడు. అతనికి సేవచేస్తూ తగినభార్య అనిపించుకొంది. అన్నపూర్ణకి తనస్వర్గసీమలాంటి జీవితంలో ఏదోకొరత, ఏవోబాధ...కన్పించసాగినయ్!

ఆమెలో మాతృకాంక్ష దినదినానికీ వృద్ధిపొంది, చిలవలూ, పలవలూఅల్లి హృదయాన్ని వేధించేది...ఏచిన్న పాపనిచూచినా, ఏ గర్భిణీస్త్రీని చూచినా అన్నపూర్ణ హృదయం బరువెక్కిపోయేది. ఎక్కడ పిల్లలు కనిపించినా, కాంక్ష నిండిన కళ్లతో వారిని వీక్షించేది...కళ్లొత్తుకుంటూ తనను తానే నిందించుకొనేది.

అనంతయ్యకూడా ఈవిషయంలో బాధపడేవాడు. కాని, పురుషుడూ, వ్యాపకంకలవాడూ కావడంచేత అతడిలోనే అది అణిగిపోయేది...కాని అన్నపూర్ణ ఆ విషయంలో కళ్లు తడిచేయని దినంలేదు...అనంతం ఎన్నిచెప్పినా, ఆమెకి ఆ విచారం పోయేది కాదు... అనంతం అసలు నాస్తికుడు! దేవుడూ, దెయ్యం లేదన్నీ, రాళ్లూ, గుళ్లూ పూజించి లాభం ఏమిటనీ వాదించేవాడు...అన్నపూర్ణమీది మమత అనంతాన్ని మార్చివేసింది ... రెండునెల్లు శలవుతో అనంతం తీర్థయాత్రలూ, నదీస్నానాలూ చేయడానికి వెళ్లాడని తెలిసిన వాళ్లు నమ్మలేదు...నమ్మినవాళ్లు మహా ఆశ్చర్యపోయారు కూడా! రామేశ్వరంలో పిల్లలకోసం 'నాగప్రతిష్ఠ'కూడా చేసుకు వచ్చారు దంపతులు సంతోషంగా...అన్నపూర్ణ తనకి సంతుకలిగినట్టే పొంగిపోయింది...

కాని నదీస్నానాలూ, తీర్థయాత్రలూ సంతానాన్నివ్వగలవా? అదే సత్యమయితే

లోకంలో గొడ్రాళ్ళే ఉండరేమో! అన్నపూర్ణలో కాలంగడుస్తున్నకొద్దీ మళ్ళీ నిరాశ, నిర్లిప్తత ఆవరించినయ్! ఆమె ఆరోగ్యం క్షీణింపసాగింది క్రమంగా... అనంతం ఏంచెయ్యాలో తెలీక బాధపడిపోయాడు డాక్టర్లూ, మందులూ వ్యర్థమే అయాయి.. అన్నపూర్ణ తన జీవితమే వ్యర్థమని తలచేది ఒక్కొక్క క్షణంలో...మానవుడిలో నిరాశా, నిస్పృహా నిండి జీవితమే రోత అనిపించినప్పుడు, భగవంతు డేదో అడ్డుపుల్లనాశాకిరణంగాచేసి, ఆశ రేపిస్తాడు. మానవజీవితంలోని మర్మమే అదేమో!

హఠాత్తుగా అనంతం స్నేహితుడైన మురళిభార్య పురిటిలో పోయింది.. మురళిని చూడడానికి వెళ్ళిన అనంతం మురళికి దేవుడిలా కన్పించాడు...పన్నెండురోజుల పసిపాపని పెంచే దిక్కులేక అల్లాడిపోయే మురళి అనంతానికా బాధ్యత అప్పచెప్తూ 'పాపనీదే అనంతం...మీలోటు భగవంతుడిలా తీర్చేడనుకో...పాప జాగ్రత్త అని వే చెప్పక్కర్లేదు...నీదే అంతాభారం'...అంటూ పాపని అనంతం చేతుల్లో ఉంచాడు... అదే పదివేలనుకొన్న అనంతం ఇంటికి వచ్చాడానందం నిండిన హృదయంతో... అన్నపూర్ణ అంతావిని ఒక్కఉరుకులో పాపని తీసుకు తన శుష్కించిన గుండెలకి హత్తుకుంది...దిష్టితీసి మెటికలు విరిచింది...పక్కవేసి పాలుపట్టి పడుకో పెట్టింది...ఊరంతా పనిగట్టుకువెళ్ళి పాప విషయం చెప్పి వచ్చింది!

అన్నపూర్ణ పిల్లల తల్లులందరి దగ్గరికీ వెళ్ళి పిల్లలికి పాలెలా పట్టాలో, నీళ్ళెలా పొయ్యాలో, ఎలా పెంచాలో కనుక్కుని వచ్చేది...అక్షరాలా పాటించేది కూడా...మొత్తానికి పెంచినతల్లి కన్నతల్లికన్న గొప్పదే అనిపించుకొంది అన్నపూర్ణ. పోయిన ఆరోగ్యం ఆమె మళ్ళీ పాప పెంపకంలో పొందగలిగింది...పాప మూడేళ్ళ ముద్దుపాపగామారి, ముద్దుమాటలతోనూ, చిన్నారి నడకలతోనూ ఇంటికో కొత్త అందాన్ని తెచ్చింది.. పాపకి 'లక్ష్మి' అని పేరుపెట్టింది అన్నపూర్ణ. పాప మాటల్లో, చేష్టల్లో స్వర్గమే చవిచూచిన ఆ దంపతులు, తమ జీవితాలకిక కొరతలేదని తలపోశారు...వారి ఇల్లు స్వర్గంలా కళకళలాడింది

మానవుడాశాప్రేరితుడై,ఆశల తోరణాల అంగణంలో అందంగా ఆడుతూ జీవించే సమయాన,అన్నిటినీ పుటుక్కునతెంపి, ఆనందించే స్వభావం దైవానిది! ఓవాడు మురళి దగ్గర్నించి ఉత్తరం వచ్చింది...మామూలు ఉత్తరమే అయినా, అది వారిని కలత బెట్టింది...'మురళివచ్చి పాపని తీసుకెళ్తానడుకదా' అనుకున్నాడనంతం... ఒక్కొక్కప్పుడు మానవుడు ఏది కాకూడదనుకుంటే అదే అయితీరడంకూడా మానవ జీవితాల్లో జరుగుతుంది... మూడురోజుల వాడు మురళి భార్యతో వచ్చాడు...అన్నపూర్ణ గుండెలో బండరాయి పడింది. బాధతో, బరువుతో ఆమె మర్యాదలు జరిపింది...లక్ష్మినిమాత్రం చంకదింపలేదు... వాళ్ళు భయపడినట్టే అనంతాన్ని మురళి పాపని తీసుకెళ్తానని కోరాడు...అన్నపూర్ణ పాపనిపెంచిన విధానం అంతాచెప్పి, పాపనివ్వమని ప్రాధేయపడ్డాడనంతం ... కాని మురళి ఒప్పుకోలేదు ... 'కావాలిస్తే మళ్ళీ పుట్టినవాళ్ళ నిస్తాలే' అన్నాడు... అన్నపూర్ణ దుఃఖానికిగాని, అనంతం వేడికోలుకుగాని, పాప రానిపెట్టే మారానికిగాని విలువ ఇవ్వని మురళి పాపని తనతో తీసుకుపోయాడు ... పాప లేమితో కళావిహీనం అయిందా గృహం. అన్నపూర్ణ హృదయం చీకటయ్యింది...పాపలేని జీవితం ఆమెలో నిరాశనింపింది...అనంతం మరో పాపని పెంచుకొందామని ఎంత చెప్పినా, ఆమె తనదుఃఖం మానలేదు ... ఆమె ఆరోగ్యం పాడయింది మళ్ళీ ... ఆమె క్రమంగా మంచంఎక్కింది మనోవ్యాధితో...

డాక్టర్లూ మందులూ ఆమె మనోవ్యాధిని కుదర్చలేక పోయాయి ... ఆమె ఆఖరికి ఆశలుతీరని మమతతో అంతంచేసుకుంది తన జీవితాన్ని ... అన్నపూర్ణకూడా లేని ఆ యింట్లో, అనంతం ఏకాకిగా నిలబడి పోయాడో దురదృష్టపు దినాన్న...

అన్నపూర్ణా, పాపా మసిలిన ఆ యింట్లో ఉండలేక పోయాడనంతం ... ఆ యిల్లు మార్చేశాడు వెంటవే ... కొన్నాళ్ళ తరువాత ఊరుకూడా మార్చేశాడు.. విధి వీచిన విసురుగాలి కెదురైన మానవుడిలో వేదాంతం తలెత్తుతుంది ... దుఃఖమయులైన వారికా వేదాంతమే జీవించే మార్గాన్ని చూపించి ధైర్యాన్నిస్తుందేమో ... అనంతం 'పోయినవాళ్ళతో పోగలమా ?' అనీ 'మనకి పిలుపు వచ్చేదాకా జీవించక తప్పదనీ' ఏడుస్తూ జీవించేది నవ్వు నటిస్తూ జీవించాలని అనుకుని తన దుఃఖాన్ని మరవడానికి ప్రయత్నించేవాడు... అనంతం జీవితచక్రం అలాగే నడిచిపోతూంది మెల్లిగా ... అనంతం జీవితం అనుకోకుండా మలుపు తిరిగింది ఓ శుభోదయాన...అడుగున పడిన అదృష్టరేఖ అంత పైకివచ్చింది...

అనంతం ఒక రోజు ఒక పల్లెకి ఇన్స్పెక్షన్‌కి వెళ్ళాడు.. మునసబుగారింట్లో భోజనం...భోంచేస్తూన్న అనంతానికి, ముద్దంబంతుల్లాంటి ముగ్గురు అబ్బాయిలు కనబడ్డారు...వాళ్ళు తండ్రిలేని అనాథలనీ, తల్లే ఎలాగో పెంచుకుంటోందనీ, ఇబ్బంది పడుతున్నారనీ, మునసబు చెప్పాడు. అనంతంలో అణిగి, మణిగి, అంతర్హితంగాఉన్న కోరిక పడగవిప్పిన పన్నగంలా వాట్యం చేసింది!

మునసబుతోవెళ్ళి పార్వతమ్మని కలుసుకుని, తన నిజ జీవితం ఆమె కళ్ళముందు పెట్టాడు దీనాతి దీనంగా...అన్నపూర్ణ ఆశలూ, అంతమూచెప్పి, తన జీవితానికో వెలుగునిమ్మనీ, ఆమె మేలు మరవననీ, బ్రతిమాలేడు. మునసబు అనంతం గురించి చెప్పిన తర్వాత, పార్వతమ్మలో జాలికలిగింది. తన ముగ్గురి కొడుకుల్లో ఒకడిని పెంపకానికివ్వడానికి ఎలాగో ఒప్పుకుంది. కాని ఒక్కసారే ఎలా ఇవ్వగలదని?

అనంతం వారానికోసారి వెళ్ళేవాడు ఎన్నో పిల్లల ఆట సామానులూ, తినుబండారాలూ పట్టుకుని...ముగ్గురు పిల్లలూ అనంతాన్ని మామా అని పిలుస్తూ చేరిక అయారు...కాని 'నాతో వస్తావా?' అని అనంతం అడిగితే, 'రాను'...అనే చెప్పేవారు...ఆఖరికి ఆమెజ్ఞానం, జ్ఞాపకం తెలీని పసివాడైన మూడేళ్ళ రవిని ఇవ్వడానికే నిశ్చయించింది...ఓ నాటి రాత్రి నిద్రలో చిన్నారి రవి అనంతం చీకటింట్లో ప్రవేశించి, కాంతివంతంగా చేశాడు ఇంటిని.

రవి రాకతో కొత్త అందాన్ని నింపుకున్న ఇల్లు కళకళలాడింది...రవి 'అమ్మ' అని మధ్యలో ఏడ్చేస్తూ అల్లరి చేసినా

# విధిలిఖితం

అంతలో ఆట సామానులతో ఆటలాడేవాడు...మిఠాయిలన్నీ అనంతానికి తినిపిస్తూ తినేవాడు...అనంతం రవిచేత 'నాన్న' అని పిలిపించడం అలవాటు చేశాడు. 'నాన్నా' అనే పిలుపు విని పొంగిపోయేవాడు. పార్వతమ్మ చూడాలనుకున్నప్పుడల్లా వచ్చేది... రవిని చూచి, ఆనందంతో వెళ్ళిపోయేది... పెద్దవాళ్ళిద్దరూ రవి సామానులన్నీ చూచి పొంగిపోయేవారు. రవి అన్నలకి తనవన్నీ పంచి ఇచ్చేవాడు.. పార్వతమ్మ ఎంతగానో ఆనందించేది పిల్లల్నిచూసి...రవి భవిష్యత్తుతోపాటు తక్కిన ఇద్దరి భవిష్యత్తూ బాగుపడుతుందని ఆశించింది పార్వతమ్మ...

మానవులు కోరుకున్న ఆశయాలన్నీ నెరవేరితే జీవితమే స్వర్గం అయి కూచుంటుంది! కోరిన కోరికలన్నీ తల్లక్రిందులు చేస్తాడు దైవం!

అనంతం ఏది తెచ్చినా రవి, అమ్మా అన్నా అంటూ మూడు వంతులు వేసేవాడు. అమ్మ రాలేదనీ, అన్నల్ని తీసుకు రమ్మనీ వేధించేవాడు. కొంచం వాళ్ళు రావడం ఆలస్యమైతే...అనంతానికి రవి వాళ్ళమీద చూపించే అభిమానం నచ్చేది కాదు. 'రవి ప్రేమని కూడా ఇలాగే వాటాలు వేస్తాడా' అని అనంతం భయపడేవాడు కూడా...ఆ భయమే అతనిలోని స్వార్థాన్ని మేల్కొలిపింది. స్వార్థపు ముసుగు వేసుకున్న మానవుడు తనకు తాను దానవుడై పోతాడు. అనంతం విషయంలో అలాగే జరిగిందికూడా...

'రవి ప్రేమ తనది...రవి తనవాడు! రవి ప్రేమ ఎవరికీ పంచకూడదు! తనెంతయినా పెంపుడు తండ్రి! ఆమె కన్నతల్లి!' అనంతం హృదయంలో పుట్టిన స్వార్థం పెరిగి పెద్దదై హృదయాన్ని కఠిన శిలకన్న కరుడు కట్టించింది. పార్వతమ్మ నెలాగైనా రవికి దూరం చేయాలనీ, 'అమ్మ' అనే పదం రవి మరిచి పోవాలనీ కోరుకొనే వాడనంతం.. అదే ఆలోచన! అదే బెంగ! ఆఖరికి అనంతం తన ఆలోచనలకు పథకం తయారు చేశాడు...


పార్వతమ్మ వచ్చినప్పుడు రవినిక బడిలో వేస్తాననీ, తరచు రావద్దనీ కోరాడు. రవి చదివి బాగుపడాలని ఉంటే ఆమె దూరంగా ఉండాలని చెప్పాడు...పార్వతమ్మ అది విని నిర్ఘాంతపోయింది...కలా? నిజమా? తేల్చుకోలేక పోయింది. తనకిలా అన్యాయం చేయవద్దనీ, పిల్లలు బెంగడిల్లి పోతారనీ బ్రతిమాలింది.. రవి చదువుకోవడమూ, డాక్టరు చదువు చదివి డాక్టరైతే తన కోరిక తీరుతుందనీ, తాను వచ్చినంతమాత్రాన రవి చదువాటంకంకాదనీ వాపోయింది. ఇలాతనూహించుకొన్నట్టయితే రవిని పెంపకానికి ఇచ్చేదాన్నికాదని అంది...కాని, అనంతంలోని స్వార్థం అతని కర్ణపుటాలకు పొర వేసింది. ఆమె దీనాలాపాలేవీ వినబడలేదు... ఆఖరికామె ఏడ్చిన ఏడుపుకుకూడా విలువ నివ్వలేక పోయాడనంతం...

'ఎప్పుడు వస్తావమ్మా మళ్ళీ?' అని అడిగే కన్నకొడుక్కి 'రా(లే)ను' అని చెప్పలేకా, వదిలివెళ్ళ లేకా బాధతో మెలికలు తిరిగిందా మాతృ హృదయం...

ఆమె బాధతో, వేదనతో వెళ్ళిపోతూంటే అనంతం మనసు బాధ పడలేదు. తనా శని విరగడయిందనీ, తనిక సుఖంగా ఉండవచ్చుననీ ఆశించాడు...

నెలలు గడిచాయి.. ఆమె రాలేదు... అనంతం ఆనందించాడు. కాని ఓ రోజు బజార్లో అనంతానికి మునసబు ఆసుపత్రికి వెళ్తూ రిక్షాలో కనిపించాడు...మునసబు మాటాడలేని నీరసంతోకూడా రిక్షా ఆపించి అనంతాన్ని చీవాట్లుపెడ్తూ 'కృతఘ్నుడివి నువ్వు...నీ జీవితంలో అమృతం చిలికించిన దేవత జీవితంలో నిప్పులు కుమ్మరించావ్... రవిమీది బెంగతో ఆమె మంచంపట్టింది... పెద్దవాడు కలరా తగిలి పోయాడు.. చిన్నవాడు బెంగతో శల్యం అయాడు...ఇ కిది న్యాయంకాదు...రవి నామెకప్ప చెప్పెయ్...' అన్నాడుకోపంతో అనంతం ఇంటికి వచ్చేశాడే గాని ఆమె రవికోసం వస్తుందేమోనన్న భయం తోనే ఉన్నాడు ... వెంటనే ఇల్లు మార్చేశాడెందుకైనా మంచిదని ... కొన్ని నెలలు అలాగే గడిచిపోయాయి...రవి బడికివెళ్తూ వచ్చేవాడు...శ్రద్ధగా చదువుకొనేవాడు ... అనంతం పెంపకంలో 'అమ్మ' 'అన్న' అన్న పదాలే మర్చిపోయాడు రవి ..., మరో ఆర్నెల్లు గడిచిపోయాయి...

పార్వతమ్మని గురించి అనంతం భయపడినట్టే, ఆమె ఒకరోజు రానే వచ్చింది! కాని ఆమెరూపే మారిపోయింది ... రేగిన తెల్లనిజుట్టు ముఖంనిండా పడిపోతూంది... పోల్చలేనంతగా చిక్కిపోయింది ... ఎముకల గూడులా ఉందామె ... నీరసంగా లోపలికి వస్తూనే 'నా రవేడీ...చూపించు...నాకొడుకుని! నా బాబు...నా రవి నిచ్చెయ్యి! ముందు చూపించు రవిని దుర్మార్గుడా'... ఆమె అరిచింది ఆ వేశం తో...అనంతం ఒక్కసారిగా తృళ్ళిపడ్డాడు ... ఆమె ఎలా వచ్చిందోకూడా అర్థంకాలేదు ... చిన్న



పిల్లాడ్ని ఎక్కడ వదిలిందో కూడా బోధపడలేదు అనంతానికి...కాని అంతలోనే అతనిలోని స్వార్థం అతనికెంతో ధైర్యాన్నిచ్చింది...అతడు ఆమె దగ్గరగా వెళ్తూ 'రవెవరు ? రవీ లేడు...ఎవరూ లేరు వెళ్ళు' ...కాస్త గట్టిగానే అన్నాడు...ఆమె అంత నీరసస్థితిలోనూ ఎగిరిపడింది "ఏడీ ? రవి? చూపిస్తావా ? చూపించవా ? నా రవి నా ప్రాణం...వాళ్ళిద్దరూ నామీద కోపంతో వెళ్ళిపోయారు. నా రవే నాకింకదిక్కు..." అంటూ భోరుమని ఏడ్వడం మొదలు పెట్టింది .అనంతం ఆమెని చెయ్యిపట్టుకు వీధిలోకి తీసుకెళ్ళి తాను తలుపేసేసుకుంటూ 'వెళ్ళు...రవిక్కడ లేడు'... అన్నాడు...ఆమె ఏడుస్తూ వెళ్ళిపోయింది.

అనంతం రవికోసం ఎదురుచూస్తూ నించున్నాడు వీధిలో...ఒక్క పరుగులో వస్తూన్న రవి బోర్లాపడి రాగాలు మొదలు పెట్టాడు...అనంతం వళ్ళో వెక్కుతూ రవి 'నాన్నా...పిచ్చిదటనాన్నా...వెంట పెట్టింది... ఇక్కడిదాకా వచ్చిందికూడా...బా ... బూ అంటోంది నన్ను'...అన్నాడు భయంతో... అనంత వంటినిండా తేళ్ళూ జెర్రిలా ప్రాకినట్టు అయింది...కాళ్ళ క్రిందిభూమి కదిలి తను కృంగిపోతున్నట్టు బాధపడ్డాడు ...వీధితలుపు వేయాలని వెళ్తున్న అనంతానికి రవి 'నాన్నా' అనివేసిన కేక వినబడి వెనక్కి తిరిగాడు ... వీధిలో నించున్న పార్వతమ్మ రొప్పుతూ, రొజుతూ లోపలికి వచ్చింది...రవి తండ్రి పీక పట్టుకుని కళ్ళు మూసేసుకున్నాడు భయంతో ... అనంతం ఏమిచెయ్యాలో అర్థంకాక అయోమయంగా నిలబడిపోయాడు...

'దా...బాబూ...నేను పిచ్చిదాన్నికాను... దా ఒక్కసారిరా బాబూ...రవీ'... చేతులు జాపుతూ ఆమె రవిదగ్గరికి వస్తూంటే, రవి కెవ్వునఅరిచి స్మృతి తప్పిపోయాడు... అనంతం గాభరాగా...రవిమీద నీళ్ళు జల్లుతూ 'వెళ్ళు పార్వతమ్మా...రవి భయపడి పోతున్నాడు...పిచ్చిదానివని అనుకొంటున్న రవి నీ దగ్గరికెలా వస్తాడు ? వెళ్ళు...నీ రవి బాగుకోరితే వెళ్ళిపో...రవిని దక్కనియ్యి' ...అంటూ బ్రతిమాలే ధోరణిలోచెప్పాడు... పార్వతమ్మ ఆవేశంతో... 'నువ్వు కడుపు కొట్టి కుడివనీ, ఇలా అన్యాయం చేస్తావనీ తెలీక ఇచ్చాను...అనుభవించుతున్నాను ... ఇప్పుడు


# మరమ్మతు ఖర్చును కాపాడుకోండి!

మైకో ఫిల్టర్ ఇన్సర్ట్సను ఉపయోగించి మీ మైకో ఫ్యూయల్ ఇంజక్షన్ ఎక్విప్‌మెంట్‌ను రక్షించుకోండి.




**MICO** LICENCE BOSCH

మోటార్ ఇండస్ట్రీస్ కంపెనీ లిమిటెడ్. బెంగుళూరు

**అధికారముపొందిన ప్రతినిధులు :**

■ దుర్గా డీసెల్ హౌస్, గోపాల రెడ్డి రోడ్డు, విజయవాడ-2 ■ యం. జి. ఆటోమోబైల్స్, ఆటోమోబైల్ డీలర్స్, పటేల్ నగర్, బళ్ళారి-2. ■ నేషనల్ ఆటో & హార్డ్‌వేర్ స్టోర్స్, కాశేశ్వరరావు రోడ్డు, బకింగ్ హాం పేట, పోస్టు, విజయవాడ, ■ ప్రీమియర్ ఏజన్సీస్, 'దుర్గా భవన్', 141, రాష్ట్రపతి రోడ్డు, సికింద్రాబాద్ ■ శ్రీ రామదాస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, పో బా నెం. 42, సుభాష్ రోడ్డు. కాకినాడ-1 ■ శ్రీ రామదాస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, శివాలయం వీధి, బందరు రోడ్డు, విజయవాడ-2 ■ శ్రీ రామదాస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లి. గొదర రోడ్డు, వాల్తేరు, అర్. యస్ విశాఖపట్టణము-4

ASP-MICO-182 TEL

**1968—69 లో మీ అదృష్టము**

మీరు ఒక పోస్టు కార్డుమీద యే పుష్పము పేరునైనా వ్రాసి, మా అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోవు పన్నెండు నెలలో జరుగు ముఖ్య సంఘటనలు అనగా వ్యాపారంలో లాభనష్టాలు, సర్వీసులో ప్రమోషన్ ట్రాన్సుఫరు, పిల్లల జననం, వివాహ సుఖ సంతోషాలు,



మరియు చెడు నక్షత్రాలకు శాంతి చేసుకొను విధానములు రు. 1-25 లకే పంపెదము. పోస్టేజీ అదనం ఒకదఫా మా విద్వత్తుప్తి చెందగలరు.

PT. DEV DUTT SHASTRI
RAJ JYOTSHI (MAP)
P. B. 86. JULLUNDUR CITY.

**తెల్ల మచ్చలకు ఉచిత వైద్యము**

శక్తివంతమైన మా ఆయుర్వేద ఔషధము "SWETARI" తెల్ల మచ్చలను కొద్ది రోజులలో తొలగించును. సాంఘిక సంక్షేమం కొరకు 1000 రోగులకు ఒక్కొక్క పాకెట్ ఉచితంగా యివ్వబడును. వెంటనే వ్రాయండి.

Sri Krishna Chandra Vaidya
(A. P.) P. O. Katrisarai (Gaya)

**ఉచితము**

ప్రతి దినము ఉపయోగపడు ఖరీదైన విలాసవస్తువులు ఉచితంగా పొందండి. వివరములకు, ఉచితంగా శాంపిల్సుకు వ్రాయండి.

MUTUAL BENEFIT (Regd)
5A, Darya Ganj, Delhi-6.

**వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టర్**



నెలకు రు. 10 వంతున చెల్లించి, రు. 265 విలువ గల ఆల్‌వరల్డ్, 3 బ్యాండ్, జపాన్ మోడల్ ట్రాన్సిస్టరు పొందండి.

CAPITAL TRADERS (WAPM)
P. B. 1477, Delhi—6.

## విధిలిఖితం

మాత్రం రవిని ఎత్తుకోకుండా వెళ్ళనా? నా రవి...నా ప్రాణం...తే...నా కొడుకుని...నా రక్తాన్ని!' అంటూ రవి ఎత్తుకో బోతూంటే అనంతం కోపంతో ఆమెని వీధిలోకి నెట్టివేసి తలుపు వేసేశాడు ... పార్వతమ్మ ఏడుస్తూ కిటికీదగ్గరకి వచ్చింది... 'బాబూ...నా రవిదొక ఫోటో యేనా ఇయ్యి... వెళ్ళిపోతాను...' ప్రాధేయపడింది మాతృహృదయం. అనంతం ఆమె నెలాగైనా వదుల్చుకోవాలని తొందరగా గోడనున్న ఫోటో తను రవినెత్తుకుని తీయించుకొన్నది కిటికీలోంచి విసిరేసాడు ... ఆమె ఏడుస్తూ ఎప్పుడు వెళ్ళిందో అనంతానికి తెలీలేదు... అతడు రవి సేవలో ఉండిపోయాడు...

ఒక్కొక్కరి జీవితంలో ఒక్క సంఘటన గొడ్డలిపెట్టులా తగులుతుంది ... పార్వతమ్మ జీవితాని కారోజు సంఘటనతో మతిచెడింది...ఆమె భర్తపోయిన తర్వాత ముగ్గురు పిల్లలూ మూడు ప్రాణాలను కొని పెంచుకునేది...ఆ రోజుల్లో అనంతం విషాదజీవితం ఆమెకి చెప్పాడు ... ఆమె మాతృహృదయం జాలితో అతడికి దయ చూపింది...రవినిస్తే రవితోపాటు తక్కిన వాళ్ళూ బాగుపడతారని ఆశించిన మాతృహృదయానికి జరిగినవన్నీ గొడ్డలిపెట్టులే అయ్యాయి...తనవారనుకొన్న ఇద్దరూ తండ్రిదగ్గర కెళ్ళిపోతే, అది దైవం చేశాడని ఏడ్చింది...మొత్తుకుంది.. కాని లాభం లేదని తెలుసుకుంది...రవికోసం ఆమె తల్లడిల్లిపోతూ, ఎలాగో కనుక్కొని వచ్చింది. అనంతం వెళ్ళగొట్టడమూ, చిన్నారి రవి తనని పిచ్చిదని భ్రమపడి భయపడటమూ ఆమె హృదయాన్ని బరువెక్కించి, మెదడికి తీవ్రమైన సంక్షోభం కల్గచేశాయి...ఆమె రవిని తల్చుకుంటూ, వీధుల్లో తిరుగుతూ ఎక్కడ పిల్లలు కనబడినా రవికోసం 'బాబూ' అని వెదుకుతూ, అందరిచేతా రాళ్ళదెబ్బలు తింటూ నిజంగా పిచ్చిదానిలాగే అయిపోయింది ... మునపటు చనిపోవడంతో ఆమె వీధులే తనఇల్లుగా తిరగసాగింది పిచ్చిగా...ఆమె ఆశయాలతోరణాలన్నీ, అనంతం స్వార్థంపు టగ్నికాహుతై బూడిదైపోయాయి...

అనంతం ఇక ఆట్టే ఆలోచించలేదు... పార్వతమ్మనించి రవిని వేరుచేయడానికే నిశ్చయించేసి, తనకున్నవన్నీ అమ్మకానికి పెట్టేసి, తన రవిని తీసుకుని మద్రాసు వెళ్ళిపోయాడు...

మద్రాసు చేరిన అనంతం నిర్విచారంగా గుండెమీద చేయివేసుకు హాయిగా నిద్రపోయాడు...తన చిన్నారి రవికోసం వీధుల వెంబడి తిరిగే తల్లి అతడికేనాడూ తలపుకికూడా రాలేదు...కాలచక్రం ఎన్ని జరిగినా, తనవిధి నిర్వహణ యథాప్రకారం చేసుకుపోతూంది...కాలచక్ర భ్రమణంలో ఎన్ని వసంతాలు వెనక్కి నెట్టివేయబడ్డాయో! ఎవరి కెరుక?...

చిన్నారి రవి పెద్దవాడయాడు...చిన్న స్కూలు వదలి కాలేజీ చదువు చదివాడు. ఆఖరికి డాక్టరు కోర్సు పూర్తికూడా చేసాడు...అనంతం తన రవి డాక్టరని తలచుకుంటూ మురిసే రోజు ముందరికి వచ్చింది ఎగురుకుంటూ......

కాని రవికీ, తండ్రికీ భేదాభిప్రాయాలు వచ్చాయి ఆ విషయంలో...'ఎక్కడికైనా, దూరమైనా వెళ్ళక తప్పదని రవీ, 'అలా వీల్లేద'ని తండ్రీ......

ఆఖరికి రవిమాటే నెగ్గింది! అనంతం ఏ ప్రాంతాలకి భయపడి మకాం మార్చేశాడో, అదే ప్రాంతాలకి వెళ్ళాల్సి వచ్చింది. అనంతం ఎంతవద్దన్నా రవి వినలేదు...' ఆఖరికి గుడికివెళ్ళే మేకపోతులా రవితో అనంతం భయపడుతూనే రైలెక్కాడు...

ఇంకా పిచ్చిది బ్రతికే ఉంటుందా?' అనీ, 'బ్రతికినా రవిని ఇంతపెద్దవాడయేక పోల్చుకుంటుందా?' అనీ, అనంతం కొంచం నిబ్బరంగానే ఉన్నాడు...ఓ మూల ఏదో భయంకూడా పీక్కుతింటూనే ఉంది. అలా ఒక ఏడాది గడిచిందేమో!

మనం దేనికి భయపడతామో అదే ఎదురైమన్ని బాధపెట్టడం నిత్యమూ మన జీవితాల్లో కన్పించే నగ్నసత్యం! అనంతం జీవితంలోకూడా అదే జరిగింది ఓ రోజు...

ఆ రోజు ఉదయాన్నే కారులోవెళ్ళిన రవి పన్నెండయినా రాలేదు. అనంతం వంటవండి రవికోసం ఎదురు తెన్నులుచూస్తూ కూర్చున్నాడు...రవిరాందే తనుతినడు... రవి ఎంత చెప్పినా 'నీతో తినకపోతే కడుపు నిండదు రవీ' అంటాడు నవ్వుతూ... రవి తండ్రి అభిమానానికి పొంగిపోతాడు...

'తల్లి ఉరేటి' అని తలపుకు వస్తుంది రవికి...చెమ్మగిల్లిన కళ్లతో అన్నపూర్ణ ఎన్వార్మెంటుకి నమస్కారం చేస్తాడు... రవి తల్లిని తలుచుకుని కన్నీరు నింపినప్పుడల్లా అనంతం మనస్సులో ఏదో మూల కలుక్కుమంటుంది! 'నీ తల్లి బ్రతికే ఉంది రవీ'...అనుకొంటాడు తనలో...అంతలోకే సర్దుకు పోతాడు మళ్లీ...తను చేసింది తప్పుకాదని సమర్థించుతుంది అతడిలోని స్వార్థం...మానవుడు తను చేసింది తప్పని తెలుసుకునే వాడే అయితే తప్పే చేయ(లే)డేమో!...

రవి ఆ రోజింకా రాలేదని అనంతం అటూ ఇటూ పచార్లు చేస్తూండగానే రెండు గంటలు కొట్టారు ... తనే ఆసుపత్రికి బయలుదేరుదామని తాళం వేస్తున్న అనంతం రవికారు హారన్‌తో తలుపుతీసాడు. రెండుకంచాలు పెడ్తున్న తండ్రినిచూచి, 'ఇంకా మీరూ తినలేదా? అలా అయితే ఎలా? ఇవాళ రాకూడదనుకొని రావడం మంచిదే అయింది...' అన్నాడు రవి బట్టలు విప్పుకుంటూ...

అనంతం నవ్వుతూ 'నీతో తినందే తోచదురా రవీ ... నీకు నేనూ, నాకు నువ్వూ ఉన్నాం...మనిద్దరం వేరుగా తినడం ఏమిటి? ఎందుకింత ఆలస్యమైందసలు?' అనడిగాడు...రవి అదోలా అయిపోతూ 'నాన్నా... ఇవాళ నా కారు క్రిందపడింది ఒక ముసిలిది... సడన్ బ్రేక్ వేసినా, ఆమె స్మృతితప్పి పడిపోయింది. దెబ్బలు తగల్లేదు కనక భయం ఉండకూడదు ... అయినా ఆమె చాలా నీరసంగా ఉందినాన్నా ... అసలామె పిచ్చిదంటున్నారంతా'...అన్నాడు...


'పిచ్చిది' అన్న ముక్కవిన్న అనంతంలో ఏదో అనుమానం, భయం ఆవరించాయి.

'ఆమె పార్వతమ్మే అయితే?' అనుకుని భయపడ్డాడు. 'అదే పోయిందిలే పిచ్చివాళ్లతో మనకేమిటి?' అన్నాడు...రవి 'అలా ఎలానాన్నా? ఆమె నా కారుక్రింద పడింది! ఆమె నా ఆసుపత్రిలోనే ఉంది... ఆమెదగ్గరే ఇప్పటివరకూ ఉన్నాం...ఇంకా తెలివిరాలేదు నాన్నా...ఆమెని చూస్తూంటే ఏదోలా అనిపించుతోంది ... ఏదో బాధగా ఉంది...' రవిమాటలువిన్న తండ్రి ఆమె పార్వతమ్మే అయి ఉంటుందని నిశ్చయం చేసుకోగానే, అతడి గుండెల్లో బండపడాయి పడిరది...రవి ఫోం చేసి పడుకోగానే అనంతం ఆసుపత్రికి వెళ్లాడు...'ఆమెని' చూసివచ్చాడు...'ఆమె పార్వతమ్మే ... ఇంకా బ్రతికేఉందా?' అనంతం అయోమయంలో పడిపోయినా, 'అదేపోతుంది రెండురోజుల్లో' అని సర్దిపెట్టేసుకున్నాడు.

రవి ఆస్పత్రికి వెళ్తూనే ఎందుకో ఆమెని చూడాలనిపించింది ... ఆమె దీనవదనం రవిముందు కదలి ఏదో వ్యక్తం కాని బాధ ననుభవించాడు. రవి కదే ఆశ్చర్యంగా ఉంది. 'తనెన్నో ఇలాటివీ, ఇంకా దీనమైనవీ చూశాడు...ఎప్పుడూ ఇలా ఫీలవలేదు తను! ఈనాడామెని చూచినా, అథమం ఆమెని తలుచుకొన్నా మనసంతా పుండులా అయిపోతూంది!' దానికేమిటి కారణమో తెలీక బాధపడ్తూనే ఆమెదగ్గరికి వెళ్లాడు ... సిస్టరు ఎదురైంది ... 'నాన్నగారిప్పుడే ఆమెని చూసి వెళ్లారు'... అని చెప్తూ ఆమెకోసారి తెలివివచ్చి 'బాబూ' అంటూ మళ్లీ స్మృతి తప్పిందనీ చెప్పింది ... రవి దగ్గరగా ఆమెని చూశాడు...ఏదో బాధతో అతడికళ్లలో నీళ్లు తిరిగాయి...మౌనంగా వచ్చేశాడు ... తన తండ్రి ఎందుకామెను పనిగట్టుకు వెళ్లి చూశాడో అర్థంకాలేదు రవికి ... తండ్రి నదే అడిగాడు రాత్రి...'ఛ. .నే వెళ్లలేదు రవీ...నాకేంపని పిచ్చిదాంతో' అన్నాడు. కానీ అనంతానికేదో దిగులనిపించింది.

రవి ఆమె బంధువులెవరో తెలుసుకుందామని, పేపర్లో ఫోటో వేయించాడా రోజు ఆమెది ... ఎంతమందో అనాథలు పోతే నర్సులే ఈడ్చిపారేశారిది వరకు...కాని ఈమెనలా చెయ్యడానికి రవి మనస్సెందుకో ఒప్పుకోలేదు ... ఒక పిచ్చిదానిమీద డాక్టరుగారి కింతశ్రద్ధ ఎందుకో తెలీక ఆశ్చర్యపడిన నర్సులు కూడా ఆమెంటే శ్రద్ధగా చూస్తున్నారు, రవిఫోటో వేయించినట్లు చెపితే అనంతం చికాగ్గా 'అనవసరం. అలాటి పిచ్చి పదులుకోవాలి రవీ...ఆస్పత్రిలో అనాథలకి కరవా? ఎంతమందికి ఫోటోలు వేయిస్తావ్? ఎవరూలేని అనాథలే ఆస్పత్రిలో చస్తారు'...అన్నాడు... రవి పట్టించుకోలేదు.

ఆ రాత్రి రవి పదయేదాకా ఉండి ఆమెని చూడాలని వెళ్లాడు...సిస్టరు కూడా వచ్చింది...డాక్టర్...మధ్యాహ్నం ఆమె బట్టల్లో ఈ ఫోటో దొరికింది...అంత ముఖ్యంకాదని మీకు చెప్పలేదు'...అంటూ ఫోటో చూపించింది...రవి అది తీసుకుని వచ్చి చూచాడు...నలిగి, పాతపడిపోయింది ఫోటో...అట్టకూడా లేదు...అస్పష్టంగా రెండు ఆకారాలు కనబడుతున్నాయి...రవి పరీక్షగాచూసి ఒక్కసారి త్రుళ్లిపడ్డాడు... ఫోటోలో తండ్రిపోలికలున్న పురుషుడో అబ్బాయి నెత్తుకున్నాడు! 'తన తండ్రి ఫోటోయే అది! ఆమెదగ్గ రెందుకుంది? ఆమె నారోజా నాన్నెందుకుచూచారు? ఏదో ఉన్నది! నాన్న దాస్తున్నారు'.. రవి బాధగా మెల్లిగా అడుగులేసుకుంటూ వెళ్లాడు.



# సపట్
## లోషన్



తామర, గజ్జి, చిడుములకు నమ్మకమైన మరియు పేరుగాంచిన మందు.

SAPAT & CO., BOMBAY 2.

ఏజంట్లు: ది ట్రేడ్ ప్రమోటింగ్ కార్పొరేషన్
బకింగ్‌హాం పేట, విజయవాడ – 2.

# ఫోస్ఫోమిన్,



శక్తిని వృద్ధిచేయును
ఆకలిని అధికము చేయును
సహనశక్తిని
హెచ్చించును,
శరీరముయొక్క రోగనిరోధక శక్తిని
ఎక్కువ చేయును

అవును —
కుటుంబము అంతటికీ
ఫోస్‌ఫోమిన్
వల్ల ఆరోగ్యము కలుగును.




ఫోస్‌ఫోమిన్...బి కాంప్లెక్స్ విటమినులు మల్టిపల్ గ్లిసరోఫోస్‌ఫేట్లుగల అతుపమ్మని పండ్ల రుచిగల టానిక్.

SQUIBB TTT ® [illegible]

SARABHAI CHEMICALS

shilpi sc 50/67 Tel.


# విధిలిఖితం

'రవీ.. పిచ్చి దాని కెలా ఉంది?' వెళ్ళిందా'? అనంతం అడిగితే రవి మాట్లాడలేదు. కాసేపాగి ఉన్న తర్వాత 'ఆమె మీకు తెలుసునాన్నా...నాదగ్గర దాచకండి...ఆమెదగ్గర మీ ఫోటోకూడా దొరికిందీ రోజు...మీరు కాదన్నా ఏదో సంబంధం ఉందని నిశ్చయంగా తెలుస్తూనే ఉంది...ఆమెనిచూస్తే నా బాధే...ఆమె మనకేదో అవుతుందని చెప్తూంది నామనస్సుకి... అసత్యం ఆడడానికి ప్రయత్నంవద్దు...'రవి అంత ఖండితంగా మాట్లాడితే అనంతం ఒక్కసారి గాభరాపడిపోతూ ఫోటో తీసుకుని చూశాడు...

'ఆమెకానాడు కిటికీలోంచి తనిచ్చిందే! అద్దం అట్టా పీకేసి అలాచేసింది.' ఏదో ఒకటి చెప్పకపోతే రవి ఊరుకోడని తెలుసు. అనంతం ఘోరమైన అబద్ధం ఆడడానికి కూడా వెనుదీయలేదా క్షణంలో...రవీ .. నిజమే! దాచాలనుకొన్నా బయట పడింది! ఆమె నాచెల్లెలే...నాన్న యుక్తవయసులో చూచే పెళ్ళి సంబంధాలను కాలతన్ని అనామకుడితో లేచిపోయింది. .నాన్న మండిపడి ఆస్తినాకే ఇచ్చారు ... నాన్నపోయాక. అతను వదిలిపోయాడని, ఇద్దరు పిల్లలని వచ్చింది ఓరోజు...కాని నాన్న ఆమెతెచ్చిన అప్రతిష్టతోనే పోయారన్న కోపంతో ఆమెని వెళ్ళగొట్టేశాను...ఆరోజే ఈ ఫోటో తీసుకెళ్ళింది ... తర్వాత చూశాన్నేను... ఆమె పిచ్చిగా తిరుగుతున్నట్టు విన్నాను... నువ్వు పిచ్చిదనగానే ఆరోజు అందుకే చూసివచ్చాను.. ఆమెనిచూస్తే నాకూ బాధగానే ఉంటుంది రవీ...ఇదీ నిజం! ఆమెని వేగం పంపించెయ్!' అనంతం అందంగా అబద్ధం ఆడితే రవి అమాయకంగానే నమ్మివేశాడు. 'ఆమెనింటికి తెద్దాం' అని, అనంతం చికాకు చూపిస్తే ఊరుకున్నాడు రవి...

ఆమె తన మేనత్తకావటాన్నే అంతగా ఉంటోందని అనుకుని తృప్తిపడ్డాడు రవి...ఆమెకి బాగుచేసి, ఆమెచేత క్షమాపణ చెప్పించి, ఇంటికి తేవాలనికూడా నిశ్చయించుకున్నాడు...

కాని మూడోరోజు సారథి వచ్చాడు డాక్టరు రవిని వెదుకుతూ...సారథిననూ్తనే

'డాక్టర్ ... ఆమెఫొటో చూసివచ్చాను. మా ఆడవాళ్ళు ఆమెని తీసుకు రమ్మంటున్నారు...ఆమెని డిశ్చార్చిచేస్తే సంతోషం... ఆమెకి జబ్బేదిలేదు...' అన్నాడు. రవి ఆశ్చర్యంతో 'పిచ్చిదటగా? సారథి? మీకే మవుతుందామె? ఇంట్లో ఎలా ఉంచుకొంటారు? ఆమెని మీకు తెలుసా? భర్త పిల్లలుఉన్నారా?' చకచకా ప్రశ్నలు వేశాడు... 'లేరు...ఆమె పిచ్చిదికాదు డాక్టర్...సంఘంలో స్వార్థపరు లెక్కువైతే ఆమెలాంటి అమాయకులు పిచ్చివాళ్ళనే పిలవబడతారేమో...ఆమె జీవితచరిత్రే ఒకగాథా... బాధానూ...ఆమెని డిశ్చార్జిచెయ్యండి. ఆమెకదే పదివేలు! ఆమెకి దిక్కెవరూ లేరు!' విషాదరేఖలు సారథి ముఖాన్ని పులుముకున్నాయి. రవి ఆమె చరిత్రను తనువిని తీరాలంటూ సారథిని ప్రాథేయంగా అడిగితే సారథి తనకి తెలిసినదంతాచెప్తూ, ఇదీ ఆమెచరిత్ర! కొడుకుపేరు జ్ఞాపకంలేదు నాకు! ఆ స్వార్థపరుడికోసం ఆదేవత తన రక్తాన్నిస్తే, అతడామె జీవితాన్నే ధ్వంసం చేసి, ఆమె రక్తాన్ని తను ఆనందంగా అనుభవిస్తున్నాడు డాక్టర్ ... అతడికే నాడైనా శిక్ష అనుభవించేరోజు రాదంటారా?' సారథి...ఆవేశంతో పళ్ళు బిగించాడు...ఆమె తన కొడుకు ఫోటోనే దగ్గరుంచుకుందని కూడా చెప్పాడు...రవి కల్లోలమైన హృదయంతో 'మిస్టర్ సారథి వారం ఆగిరండి...మీ ఎడ్రసిచ్చి వెళ్ళండి. ఆమె బాగుంటే తీసుకువెళ్ళుదురుగాని...అవసరం అయితే కబురుచేస్తాను...' అన్నాడు... సారథి తన మామగారైన మునసబు ఇంటి, ఎడ్రస్ వ్రాసి ఇచ్చి వెళ్ళిపోయాడు.


రవి బాధగా తల కొట్టుకున్నాడు... 'ఏదినిజం? ఏదబద్ధం? నాన్న అబద్ధం చెప్పారా? సారథికేం పట్టింది? అబద్ధం ఆడటానికి? తన మేనత్తకాదా ఆమె? ఆమె తనను నవమాసాలూమోసి కన్న మాతృదేవతా? మరి అమ్మఫొటో? తను తండ్రికి పెంపకం కొడుకా?' రవిహృదయం అల్లకల్లోల సాగరంలా అయింది...నిజం ఎలా తెలుసుకోవాలో తెలీని రవి బాధగా నిట్టూర్చాడు...రాత్రి పది తర్వాత ఇంటికి వెళ్ళాడారోజు...రవి...బాధతో బరువెక్కిన హృదయంతో...

అనంతం మామూలుగా భోంచేసి పడుకున్నాడు...రవికి మాత్రం నిద్రరాలేదు. 'తను నిజంతెలుసుకొనేదెలా?' అన్న సమస్య రవిని బాధించి వేధించింది. రాత్రి పన్నెండయ్యాక రవి ఒక నిశ్చయానికివచ్చి నిద్రపోయాడు. మర్నాడంతా రవి మామూలుగానే తిరుగుతూ తండ్రితో మామూలుగానే ఉన్నాడు...రాత్రి వేగంగానే వచ్చాడు... అనంతానికి నీరసం తగ్గుతుందనీ, మంచి శక్తిగా ఉంటుందనిచెప్తూ అనంతానికి ఇంజక్షనిచ్చాడు...తన రవికి తనమీద ఉన్న శ్రద్ధని చూసిన అనంతం ఆనందంతో మత్తుగా నిద్రాదేవి వడిలో వాలిపోయాడు.

రవి టైము చూశాడు...పదీపావు! ఒక్కసారి మత్తుగా పడుకున్న తండ్రినీ, ఎదురుగా నవ్వుతూన్న అన్నపూర్ణ ఫొటోనీ చూసి ఒక్కసారి నిట్టూర్చాడు... తండ్రి గదిలోకివెళ్ళి పెట్టెతీశాడు తండ్రిది.. రవి చేతులు వణికిపోయాయి ... దడ దడలాడే గుండెలూ, వణికే చేతులూ, వెనకాడే హృదయమూ రవిని కల్లోల పరిచాయి .. 'ఇంత చదివీ, తండ్రి తన జీవితాన్ని ఇట్టె బయలుగా దాచుకొన్న 'డైరీ' చదవడానికి సిద్ధపడ్డాడు తను!' ఇదే బాధతో రవి తల్లడిల్లిపోయాడు ..అయినా నిజం తెలుసుకోవాలంటే తప్పుపనేనా చేయాలి ... ఒక పెద్ద 'మంచి'కోసం చిన్న 'చెడు'చేయడం మంచిదే అనుకొన్నాడు మళ్ళీ ... ఆఖరికి వణికే హస్తాల్తో డైరీ తెరవబడింది ... ఎర్రసిరాతో కొన్నిచోట్ల గీటులు పెట్టబడి ఉన్నాయి...రవి చలించే నేత్రాలు చదువుకు పోతున్నాయి ...

అనంతం తన జీవితమంతా డైరీలో పొందుపరిచాడు...ప్రతీ సంఘటనా విపులంగా వ్రాసుకున్నాడు ... ఒక్కొక్కటీ చదువుతూంటే రవి హృదయం బాధతో మెలికలు తిరిగి పోతూంది ... పార్వతమ్మ ఏడుస్తూ బ్రతిమాలడమూ, తన తండ్రి కాఠిన్యమూ చదివిన రవి క్రోధంతో వణికిపోయాడు.. ఆమె పిచ్చిదిగా మారే సంఘటనలన్నీ చదివిన రవి పిచ్చివాడే అయిపోయాడు. 'అమ్మా...ఎంత బాధపడి పోయావమ్మా ... నేను బ్రతికుండీకూడా నిన్ను పిచ్చిదాన్ని చేశానమ్మా'...రవి బాధగా తల గోడకేసి బాదుకున్నాడు...టైము టంగ్ టంగ్ మంటూ నాలుగు కొట్టేదాకా, రవి అయోమయంగా కూర్చుండి పోయాడక్కడే...

ఒక్కసారి త్రుళ్ళిపడి లేచి, తండ్రి పెట్టెలో అన్నీపడేసి తలుపేసి, తండ్రిగది దగ్గరకి వచ్చాడు ... తండ్రిమత్తు ఇంకా పనిచేస్తూంది...తన బ్యాగూ, పర్సూ తీసుకు గేటు దాటాడు...ఆస్పత్రిలో రోగులెవరూ లేవలేదింకా ... కోళ్ళు ఒక్కొక్కసారి కూస్తున్నాయి ..చీకటింకాపేరుకునేఉంది...



# విధిలిఖితం


రవి ఆమె దగ్గరికి వెళ్ళాడు...ఆమె నిద్రలో ఉంది...మానవ స్వభావమైన తెలివి లేదామెలో...రవి సిస్టర్ల సహాయంతో ఆమెని జట్కాలో పడుక్కో పెట్టాడు. సిస్టర్లకీ విషయం కట్టుదిట్టంగా ఉంచమని చెప్పి, తనూ జట్కా ఎక్కాడు ... జట్కాలో తల్లితల తన తొడమీదపెట్టుకుని చూస్తూ కూర్చున్నాడు.. అప్పటికే వాలుగుమూలలా వెలుతురు ప్రవేశించి, చీకటిని పారద్రోలింది...

రవి తల్లిపడ్డ బాధలన్నీ తలుచుకుంటూ, తనతండ్రి ఎందుకిలా చేశాడా అని బాధపడుతూ కూర్చున్నాడు ... 'తన తల్లి ఇక జీవించేది దినాలో, గంటలో ? తనకి తల్లిలేదని దుఃఖించేవాడు ! తనకూ ఒక అమ్మ ఉందని మురిసేలోగా, తల్లి తనని విడిచి వెళ్ళిపోతుంది ! మళ్ళీ తనకి తల్లిలేని జీవితం మిగలు !' జట్కా మునసబుగారింటి దగ్గర ఆగింది...సారథి జట్కా దగ్గరికి వస్తూనే గాభరాగా ... 'డాక్టర్...ఏమిటిది ?' అన్నాడు...రవి విచారంగా ముఖంపెట్టి 'ఆమెని తెచ్చాను సారథీ ...ఆఖరిదశలో ఉంది...అంత్యకాలంలో ఆమె కోరిక తీరింది సారథీ'...అన్నాడు. సారథి అయోమయంగా చూశాడు ... ఆమెని ఇంట్లో ఆదరంగా పడుకోపెట్టి ఆడవాళ్ళు విచారంగా నిలబడిపోయారు...తన తల్లిమీద ఆ కుటుంబం చూపే ఆదరణకీ, అభిమానానికీ, ముగ్ధుడైపోయాడు రవి...అంతా నిశ్శబ్దం అయింది...రవి బాధపడుతూ, సారథికంతా వివరంగా చెప్తూ 'సారథీ...అమ్మ నాకోసం అష్ట కష్టాలూ పడింది...నేను అమ్మా అని నోరారా పిలిచే సమయానికి తెలివిలేకుండా పడిఉంది ... నా మనస్సంతా బాధతో నిండిపోయింది ... అమ్మకిక ఆఖరిక్షణాలివి'...రవి భోరుమని ఏడుస్తుంటే సారథీ, తక్కినవాళ్ళూ ఓదార్చారు...'ఆమె కన్నకొడుకు మీరే అని తెలిసినందుకే సంతోషంగా ఉంది ... పోయే జీవికి ప్రాణంపోయడం మనకి చాతకానిపని డాక్టర్...ఆఖరిదశలోనైనా ఆమె తృప్తిగా ప్రాణంవిడిస్తే అదే పదివేలు ! ఆమెకొక్కసారేనా తెలివి వచ్చేటట్టు చేయండి ... కళ్ళారా కన్నకొడుకును చూచి మరీ ప్రాణం విడుస్తుంది'.. సారథిఅన్నాడు విచారంగా... రవి ఇంజక్షన్ ఇచ్చాడు ... రవిని చూచి ఆ కుటుంబం ఎంతో సంతోషించారు ...

సాయంత్రం వరకూ అలాగే ఉంది ... రాత్రయ్యాక ఆమెలో కొంచెం చలనం కలిగింది...రవి సంతోషంతో సారథి వేపు చూశాడు...సారథి ఆమెనోట్లో గ్లూకోజ్ పోశాడు...ఆమె నయనద్వయం విడివడింది ...వదనంలో ఏదో కాంతి తళుక్కుమంది... ఆమె శుష్కించిన అధరాలు కంపించాయి... అస్పష్టంగా ఆమె ఏదో గొణిగింది ... 'బా...బూ' అంటూ...రవి బాధగా ఆమె ఎండిపోయిన చేతిని తన చేతిలోకి తీసుకుంటూ ఆమెమీదకు వంగి 'అమ్మా ... నీ బాబు వచ్చాడమ్మా ... కళ్ళుతెరిచి చూడమ్మా...నోరారా రవీ అని పిలువమ్మా ...నిన్ను పిచ్చిదాన్ని చేసిన నీ రవి వచ్చాడమ్మా ... నీకోసం ... అమ్మా ఒక్కసారి తెరువు నన్ను చూడు...అమ్మా...' రవి చిన్నపిల్లాడిలా వలవలా ఏడుస్తుంటే, అంతా కళ్ళు వత్తుకున్నారు ... తనకోసమే ఆమె ఇన్నాళ్ళూ ఇంతగా బాధపడిందని తెలుసుకున్న రవికి దుఃఖం ఆగడంలేదు ... ఎంత ఊరడించినా అతనికి దుఃఖం పెల్లుబికి వస్తూనే ఉంది...

హఠాత్తుగా ఆమెకళ్ళు తెరచింది. శూన్యంలోకి వాలుగుప్రక్కలా చూస్తూ తన రెండుచేతులూ ఎత్తాలని ప్రయత్నం చేసింది...అతి నీరసంగా ఉన్న ఆమెహస్తాలు మరి కదలలేక ఒక్కసారి క్రిందపడిపోయాయి...కన్నకొడుకుని చేతులారా తడుముకుని గుండెకి హత్తుకుందామనుకొందేమో ఆ మాతృహృదయం ! కాని ఆమెలో కాంతి ఒక్కసారి మాయమైపోయింది ! వదనం కళా విహీనమైపోయింది...రవి ఒక్కసారి గొల్లుమన్నాడు ...ఆమె కన్నకొడుకు హస్తద్వయంలో తృప్తిగా జీవితం చాలించుకొంది...

అనంతం నాలుగురోజులై పిచ్చివాడిలాగే తిరుగుతున్నాడు...రవి ఎక్కడికి, ఎందుకు తనతో చెప్పకుండా వెళ్ళాడో అని తోచకుండా తిరుగుతున్నాడు. 'ఆమె ఉందేమో అని వెళ్ళిచూచాడు. ఆసుపత్రిలో లేదామె.. డిశ్చార్జి అయిందని చెప్పారు. 'రవి ఎక్కడికెళ్ళినట్టు? అనంతం హృదయం బాధతో నిండింది...'రవిలేని క్షణం తనకి యుగంలాఉంది...తనరవి తన ప్రాణం కన్న ఎక్కువ! రవిని వదిలి ఉండలేడు తను! అనంతం హృదయంలో ఏదో వెలుగు కన్పడింది...'తనెంత పనిచేశాడని? కన్నతల్లికి కొడుకు కాకుండా వేరుచేశాడు...ఆమెని పిచ్చెక్కించి రోడ్లవెంబడి తిరిగేటట్టుచేశాడు... పైగా ఆమె 'పిచ్చిది' అని భయపెట్టాడు కొడుకును! పెంచినప్రేమకే తను రవికోసం మూడురోజుల్లో ఇంతగా ఇదయిపోతున్నాడే? ఆమెకన్న కడుపుకోసం పిచ్చెక్కిందంటే ఆశ్చర్యమేముంది కనక? ఛీ...ఛీ... ఎంత స్వార్థపరుడై పోయాడు తను? రవి!



ఆహ్లాదకరమైన స్నానమునకు

బెంగాల్ కెమికల్స్ గోల్డెన్

# సాండల్ వుడ్

సోప్



శ్రీగంధంయొక్క మనోహరమైన సుగంధం, స్నానానంతరం కూడా మిమ్ములను దినమంతా ఉల్లాసంగా ఉంచును



బెంగాల్ కెమికల్

కలకత్తా * బొంబే

కాన్పూరు * ఢిల్లీ

ఆఖరికి...ఒక క్రొత్త శాస్త్రరీత్యా తయారైన ఫార్ములా

నిషక్

• గులిమిని కరగించును
• రోగములను నివారించును
• బాధను పోగొట్టును
• బాగుగా వినపడేలా చేయును

ధర రు. 2 80 + స్థానిక పన్నులు అదనము

శాస్త్రరీత్యా తయారుచేయబడినది నిషక్ తామరమందు ఇంకా యితర చర్మ వ్యాధులకు కూడ పనిచేస్తుంది

విటాల్ మెడిసిన క్రీమును తయారుచేయువారు

కొచ్చిన్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్
బొంబాయి-26 – కొచ్చిన్-2.
అందరి కెమిస్టులవద్ద లభించును

డిస్ట్రిబ్యూటర్లు:
మెస్సర్స్ గణపతి & కంపెనీ,
103/104 లింగి చెట్టి స్ట్రీట్,
పోస్టు బాక్సు నెం 1986, మద్రాసు 1

యూనీ-డ్రగ్ హౌస్, సింగపూరు-1
నుండి స్టాకులు పొందవచ్చును.


## విధిలిఖితం

రా...నిజం తెలుసుకో...నీ అమ్మని తీసుకు వచ్చి ప్రాణం పోద్దాం రవీ...రా...ఎక్కడికెళ్ళావ్? నాలో పశ్చాత్తాపం కలిగింది రవీ. రా.. నన్ను క్షమించు ... మిమ్మల్నిక ఎవరూ వేరుచేయలేరు రా. రవీ...అనంతం గుండె బాధగా బరువెక్కింది...తనలో పరివర్తన వచ్చిన శుభక్షణం! దాన్ని పదిలంగా తన జీవితడైరీలో సువర్ణాక్షరాలతో లిఖించాలి! మరి తను రవినీ, తల్లినీ దుఃఖపెట్టాడు!'.. అనంతం పెట్టెతీశాడు డైరీ కోసం...అడుగునఉండే డైరీ మీదనేపడి ఉంది...అంతా అర్థమయిన అతడు నెత్తి బాదుకున్నాడు...'రవి అంతా తెలుసుకుని తల్లినితీసుకుపోయాడా? ఎక్కడికివెళ్ళాడు? మునసబు ఇంటికా? ఏమో' అనంతంఇంటికి తాళంవేసి బయలుదేరబోతూంటే, పోస్టుమన్ ఒక కవరిచ్చివెళ్ళాడు...అది రవి దస్తూరే...అనంతంశరీరం గడగడ వణికింది. వణికే చేతుల్తో చింపాడు కవరు...

నాన్నా నమస్కారాలు...

ఈ నిర్భాగ్యుడన్నీ తెలుసుకున్నాడు నాన్నా...అమ్మ ఆఖరిక్షణం ఆస్పత్రిలో... నాకు బాధనిపించింది...మీరు ఒప్పుకోరని తెలుసు నాకు...అందుకే మునసబు ఇంటికి వచ్చాం... అమ్మలేదని ఏడ్చేవేను, నాకూ 'అమ్మ' ఉందని పొంగే లోపలే, మళ్ళీ 'అమ్మ'లేని అదృష్టహీనుడిగా నిలబడిపోయాను లోకంలో...మీకు నాపై ప్రేమ ఉండవచ్చు...కాని కన్నకడుపును దూరంచేసేటంత విపరీతంగా ఉండటం నా దురదృష్టం...అయిన దానికి విచారించే తత్వం కాదునాది...అమ్మ తృప్తిగా జీవం అంతం చేసుకుంది. కాశీ, గయ, వెళ్ళి ఒకనెలలో వస్తాను...ఇంకేం వ్రాయను? అమ్మలేని నిర్భాగ్యుడు రవి...

అనంతానికి గుండెలో పోటువచ్చింది... 'అంతా జరిగి పోయింది...తను దోషిగా కొడుకుముందు నిలబడిపోయాడు...తనకది చాలు! ఆమె కొడుకు చేతుల్లో హాయిగా వెళ్ళిపోయింది...ఆఖరికంతా తారుమారైంది...తన స్వార్థమే తనకిమిగిలింది!' అనంతం వళ్ళు వేడెక్కింది...అక్కడే అలా పడిపోయాడు నీరసంగా... ●